క్లుప్తంగా

విద్యార్థికి అభినందన కార్యక్రమం



పొన్నూరు: నిడుబ్రోలు కొండమూడి రోడ్డులోని గణపతి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని పాలపర్తి భార్గవి పదో తరగతి ఫలితాల్లో 569 మార్కులతో పాఠశాల మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని విద్యార్థినిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్



పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకాని గ్రంథాలయ ఆవరణలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ అన్నారు. పెదకాకానిలో ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ కొనసాగుతుందని.. ఆదివారం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా పుస్తక ప్రదర్శన, విద్యార్థులతో కథలు చదివి, వినిపించి వారితో చెప్పించామని అన్నారు. అనంతరం విద్యార్థులతో యోగ, పరుగు పందెం, లెమన్ స్పూన్ పోటీలను నిర్వహించామని తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీహెచ్ఆర్సీ జిల్లా అధ్యక్షుడిగా గురవయ్య

నెహ్రూనగర్: భారతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా దాసరిపల్లె గురవయ్య(విక్టర్) ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు నగరంలో గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. బీహెచ్ఆర్సీ జిల్లా కో ఆర్డినేటర్‌గా ఎస్.రమేష్, వైస్ ప్రెసిడెంట్‌గా తిరుపతిరావు, సెక్రటరీగా రత్నశేఖర్ ఎన్నికయ్యారు.

ముస్లింలకు కిట్లు పంపిణీ



లక్ష్మీపురం: ముస్లిం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు కిట్లు పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్థానిక అంజుమన్ ఇస్లామియా హైస్కూల్లో పేద ముస్లిం బాలురకు ఉచిత ఖత్నా కార్యక్రమంతో పాటు పోషకాహారం, మెడికల్ కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సలీం, అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం విజయవంతంగా చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎండీ ఆరిఫ్, ఎండీ ఇనయతుల్లా, షరీఫ్, అడ్వకేట్ సలీం పాషా, అబ్దుల్ రెహమాన్ సయ్యద్ యూసఫ్ హుసేని పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

లక్ష్మీపురం: షుగర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆరోగ్యం గురించి సోషల్ మీడియాలో వచ్చే వివిధ రకముల దుష్ప్రచారాలను నమ్మరాదని, అలా నమ్మి అనుసరిస్తే చాలా సందర్భాల్లో అనారోగ్యాలకు గురి అయ్యే అవకాశం ఉందని సూచించారు. కావున సరైన వైద్యుని వ్యక్తిగతంగా కలిసి సమస్యలు తెలిపి వారి సూచనలు మేరకు మందులు వాడుకోవాలని కోరారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, వాణిజ్యవేత్త బాదం బసవ గుప్త, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కె.చంద్రశేఖర రావు పాల్గొని ప్రసంగించారు.

ఉచిత ప్రవేశాలకు ప్రచారం కరువు!

- మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఏర్పాటుకాని హెల్ప్‌డెస్క్‌లు
- ఎంఆర్సీలు, సచివాలయాల వద్ద కనిపించని ఫ్లెక్సీలు, పోస్టర్లు
- అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం

ప్రత్తిపాడు: పేదలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలపై అవగాహన కల్పించడంలో క్షేత్ర స్థాయిలో విద్యాశాఖ అలసత్వం వహిస్తోంది. విద్యాహక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రైవేటు యాజమాన్యాలు అయిదేళ్లు నిండిన విద్యార్థులకు 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలను అందించాల్సి ఉంది. కానీ అవన్నీ నీటి మీద రాతలు, కాగితాల్లో లెక్కలుగానే మిగిలిపోతున్నాయి. ఆచరణకు మాత్రం ఆమడ దూరంలో నిలుస్తున్నాయి. కారణం 25 శాతం ఉచిత ప్రవేశాలపై ప్రజల్లో కనీస అవగాహన లేకపోవడం, కొన్ని యాజమాన్యాల్లో కూడా కొంత నిరాసక్తత ఉండటంతో పాటు గ్రామస్థాయి వరకు సామాన్య ప్రజలకు అవగహన లోపించడమే.

> 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్య జన్మించి అయిదేళ్లు నిండిన వారు అర్హులు.

ఎవరికి ఎంత శాతం కేటాయింపు..

ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు, అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత బాలలు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూల్డ్ తెగలకు 4 శాతం, షెడ్యూల్డ్ కులాలకు 10 శాతం, బీసీ, మైనారిటీ, ఓసీల్లోని బలహీనవర్గాలకు 6 శాతం సీట్లు కేటాయిస్తారు. పేద కుటుంబాలకు చెందిన బాలలు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల్లోపు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.44 లక్షల్లోపు ఉండాలి.



ప్రభుత్వం రూపొందించిన పోస్టరు

అవగాహనలో అలసత్వం..

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపుపై గ్రామ, మండల స్థాయిల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. పత్రికల్లో ప్రకటనలివ్వాలని, మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు, గ్రామ సచివాలయాల వద్ద బ్రోచర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. మండల స్థాయిలో 12(1)సీ రిజిస్ట్రేషన్, అడ్మిషన్లపై ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యే వరకు అవగాహన కల్పించాల్సి ఉంది. అదే విధంగా మండల స్థాయిలో హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేయాలి. ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్, లోకల్ మీడియాల్లో కానీ క్షేత్ర స్థాయిలో ఆదేశాలు అమలుకు నోచడం లేదు. అవగాహన లేకపోవడంతో దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి కనిపిస్తుంది.

దరఖాస్తు చేసుకోవడం ఎలా..

గతనెల 28వ తేదీన ప్రారంభమైన ఈ అప్లికేషన్‌కు మే 15వ తేదీ లోపు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా మీసేవ, సచివాలయం, ఇంటర్నెట్, విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జీఎస్‌డబ్ల్యూఎస్ డేటా ద్వారా విద్యార్థుల ఎంపికను నిర్వహిస్తారు. మే 21 నుంచి 24 వరకు లాటరీ విధానం ద్వారా మొదటి దశలో ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలను జూన్ 2వ తేదీన నిర్ధారిస్తారు. రెండవ దశ ఎంపిక జాబితాను జూన్ 6వ తేదీన విడుదల చేస్తారు. జూన్ 6వ తేదీన ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలను జూన్ 12న నిర్ధారిస్తారు.

పురాణ కాలక్షేప మండపం శంకుస్థాపన



కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం పురాణ కాలక్షేప మండపం శంకుస్థాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించే తిరునాళ్లను పురస్కరించుకుని పాల్గొనే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. పటిష్ట భద్రత కల్పించాలని పోలీసులకు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జాతర..

నిడుబ్రోలు 12వ వార్డు శ్రీనివాస కాలనీలోని శ్రీ డిల్లీ పోలాక్షమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు విశేష పూజలు చేసి పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటు ధరలో నాణ్యమైన ట్రాక్టర్లు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సోమశేఖర్

పెదకాకాని: రైతులకు అందుబాటు ధరలో నాణ్యమైన ట్రాక్టర్లు అందించాలనే లక్ష్యంతో వారాహి మోటర్స్ ప్రారంభించామని ఏపీ అసోసియేట్ జనరల్ ప్రెసిడెంట్ సోమశేఖర్ అన్నారు. మండల పరిధిలోని ఆటోనగర్‌లో ఆదివారం వారాహి మోటార్స్ నిర్వాహకులు కొంగర అభిలాష్ , పర్చూరి కమలేంద్రబాబు ఏర్పాటు చేసిన ఐచర్ ట్రాక్టర్ షోరూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేష్ నాయుడు మాట్లాడుతూ.. ఐచర్ దేశంలోనే మొదటి ట్రాక్టర్ సంస్థ అని.. నేటికీ 20 లక్షల ట్రాక్టర్లు వివిధ రంగాలలో ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ టాక్టర్స్ వల్ల రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. 31 మండలాలు వారాహి మోటర్స్ పరిధిలో ఉన్నాయని.. ధర తక్కువతో పాటు అన్ని వర్గాల రైతులకులో మెయింటినెన్స్ కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతులు, పారిశ్రామికులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన వెస్ట్ డీఎస్పీ అరవింద్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైన రౌడీ షీటర్లు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ హెచ్చరించారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు వెస్ట్ డీఎస్పీ స్వయంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. తొలుత రౌడీ షీటర్లు రోజు వారి పనుల గురించి, ఒక్కొక్కరిపై ఎలాంటి కేసులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఆదివారం స్టేషన్‌కు వచ్చి సంతకం పెడుతున్నారో లేదో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఆదివారం సంతకం చేసేందుకు తప్పకుండా రావాల్సిందిగా రాని వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. అదే విధంగా రౌడీ షీటర్లు ఎక్కడైన ఏదైన వివాదంలో, సెటిల్‌మెంట్లు అంటూ వ్యవహరిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు తెలియకుండా ఊరు దాటి వెళ్లడానికి వీలు లేదన్నారు. ఏ సమయంలో స్టేషన్‌కు పిలిచిన గంటల వ్యవధిలో అందుబాటులో ఉండాల్సిందగా చెప్పారు. మరి ముఖ్యంగా రౌడీ షీటర్లు నివాసం ఉండే ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం, గంజాయి, వంటివి, జరుగుతున్నట్లు ఉంటే తప్పకుండా సమాచారం తెలియజేయాల్సిందిగా సూచించారు. డీఎస్పీ వెంట సీఐ ఆరోగ్య రాజు, ఎస్ఐ రోజాలత, స్టేషన్ రైటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తిరునాళ్లలో ఉద్రిక్తత

- పోలీసుల అత్యుత్సాహం
- అనుమతులు లేవని నిలిపివేసిన ప్రభ



ఆర్కెస్ట్రా నిలిపి వేసి కమిటీ ఏర్పాటు చేసిన ప్రభ

పొన్నూరు: పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టడమే లక్ష్యంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. కూటమి పార్టీలకు వ్యతిరేకంగా పనిచేసే వారి పట్ల అధికారాన్ని ఆయుధంగా మలుచుకుని గ్రామాల్లో శుభకార్యాలను సైతం అడ్డుకునే విధంగా పావులు కదుపుతున్నారు. అధికార పార్టీ ప్రోత్సాహం.. పొన్నూరు రూరల్ పోలీసుల అత్యుత్సాహంతో ఆదివారం పొన్నూరు మండలంలోని వెల్లలూరు గ్రామంలో జరుగుతున్న శ్రీ దుర్గాదేవి తిరునాళ్ల మహోత్సవంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉత్సవంలో అవాంతరాలు సృష్టించేందుకు స్థానిక కూటమి నేతలు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఉత్సవంలో భాగంగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలో సంబరాలను ఎలాగైనా ఆపేందుకు తమ ప్రభావాన్ని చూపారు.

అనుమతి లేదని హుకుం..

దేవస్థానం కమిటీ ఒక ప్రభ, కూటమి నేతలు రెండు ప్రభలను ఏర్పాటు చేసుకునేందుకు విడివిడిగా పోలీసుల వద్ద పూచీకత్తుతో కూడిన అనుమతి పొందినట్లు సమాచారం. సాయంత్రం కార్యక్రమం ప్రారంభించే సమయానికి దేవస్థానం కమిటీ ఏర్పాటు చేసిన ప్రభకు అనుమతి లేదని, ఆర్కెస్ట్రా పెట్టకూడదని రూరల్ పోలీసులు హుకుం జారీ చేశారు. దీంతో దేవస్థానం కమిటీ ఏర్పాటు చేసిన ప్రభకు అనుమతి ఉన్నా రూరల్ పోలీసులు అడ్డంకులు సృష్టిస్తున్నారని గ్రామ సర్పంచి ఇక్కుర్తి మల్లికార్జునరావు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు తెలిపారు. అయినప్పటికీ రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దేవస్థాన కమిటీ ఏర్పాటు చేసిన ప్రభకు మాత్రమే అడ్డంకులు సృష్టించి ఆర్కెస్ట్రా నిర్వహణ నిలిపివేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉత్సవాలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గ్రామంలో స్వేచ్ఛ కనుమరుగైందని, అధికారాన్ని ఆయుధంగా మలిచి ఆందోళనకర వాతావరణం సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చి

రూ.57 వేలు అపహరణ

మంగళగిరి టౌన్: ఏటీఎం సెంటర్ వద్దకు డబ్బులు డ్రా చేయడానికి వచ్చిన వ్యక్తి కార్డు మార్చి.. అతన్ని ఏమార్చి డబ్బులు కాజేసిన కేటుగాడి వ్యవహారం మంగళగిరి పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని నిడమర్రుకు చెందిన మండేపూడి మణికుమార్ కిరాణాషాపు నడుపుతున్నారు. ఈనెల 1న సరుకుల కొనుగోలు నిమిత్తం మంగళగిరికి వచ్చాడు. గౌతమ బుద్ద రోడ్‌లో ఉన్న ఓ ఏటీఎం వద్దకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డబ్బులు డ్రా చేసే క్రమంలో రూ.20 వేలను నగదును మిషన్‌లో ఎంటర్ చేశాడు. ఇదే సమయంలో అతని వెనుక ఉన్న వ్యక్తి మణికుమార్ నమోదు చేసిన పిన్ నెంబర్‌ను గమనించాడు. అనంతరం 'డబ్బులు డ్రా చేసేందుకు ప్రాసెస్ మారింది.. మీకు తెలియదా' అంటూ మాట కలిపాడు. బ్యాంక్ సిబ్బంది అనుకుని ఆ వ్యక్తితో తనకు తెలియదంటూ చెప్పాడు. డబ్బులు డ్రా చేయాలంటే మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది చూడండి అంటూ ఏటీఎం స్క్రీన్ ముందుకు సదరు వ్యక్తి వచ్చాడు. మణికుమార్ సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని తప్పుగా ఎంటర్ చేసి డబ్బులు రావడం లేదంటూ నమ్మబలికాడు. అనంతరం మణికుమార్‌ను నమ్మించేందుకు మినీ స్టేట్‌మెంట్ ప్రింట్ తీసి మీ డబ్బులు ఎక్కడకు పోలేదు.. ఖాతాలోనే ఉన్నాయన్నారు. ఈ క్రమంలో మణికుమార్ ఏటీఎం కార్డును తన జేబులో పెట్టుకుని తన దగ్గర ఉన్న అదే బ్యాంకుకు చెందిన మరో ఏటీఎం కార్డును మణికుమార్‌కు ఇచ్చాడు. కార్డు మారిన విషయం గమనించని మణికుమార్ అక్కడి నుంచి వెనుదిరిగాడు. 10 నిమిషాల తరువాత డబ్బులు విత్‌డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో హడావుడిగా బ్యాంక్ ఏటీఎం వద్దకు వచ్చి ఆ వ్యక్తి కోసం వెతికాడు. కనిపించకపోయే సరికి తాను మోసపోయానని గ్రహించాడు. ఈలోపే ఓ ప్రైవేటు బ్యాంక్ ఏటీఎం నుంచి వరుసగా నాలుగు దఫాలుగా రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. మరుసటి రోజు మరలా రూ.10 వేలు, రూ.7 వేలు మరోసారి డ్రా చేసినట్లు మెసేజ్‌లు రావడంతో ఆదివారం మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యోగాతో మానసిక ప్రశాంతత

తెనాలి అర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ ఆంజనేయ యోగా కేంద్రం వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ పేర్కొన్నారు. యోగా కేంద్రం ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన చిన్న పిల్లల యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో ఎక్కువ మంది మానసిక ఒత్తిడితో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అనేక శారీరక రుగ్మతల నిర్మూలనకు యోగా దోహదపడుతుందని చెప్పారు. అనంతరం దాత విక్రమ్ సహకారంతో చిన్నారులకు ఆట వస్తువులు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంత లక్ష్మి, సూర్యనారాయణ, సుబ్బారావు, రేఖ, కోమల, రాంబాబు, మధు, సంపూర్ణ పాల్గొన్నారు.

కేజీఎఫ్ కార్యాలయం ప్రారంభం



తెనాలి: కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) తెనాలి కార్యాలయాన్ని ఆదివారం ఇక్కడి ప్రకాశం రోడ్డులోని కాంప్లెక్సులో ప్రారంభించారు. కేజీఎఫ్ వ్యవస్థాపకుడైన జెట్టి కుసుమ కుమార్ ఆదేశాలపై ఆ సంస్థ తెనాలి అధ్యక్షుడిగా జెట్టి శివరామకృష్ణప్రసాద్ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. భవిష్యత్‌లో కమ్మ సామాజికవర్గానికి అందించాల్సిన తోడ్పాటుపై ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిపారు. జెట్టి నాగభూషణం, జెట్టి నాగేశ్వరరావు, తుమ్మల బాపయ్యచౌదరి, అంకినీడు, శంకర ప్రసాద్, ప్రవీణ్, సాయి, గిరీష్ పాల్గొన్నారు.

పేషెంట్ రిలేషన్‌షిప్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా పేషెంట్ రిలేషన్‌షిప్ అసోసియేట్(పీఆర్ఏ) కోర్సులో రెండు నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ పాస్, డిగ్రీ పాస్, ఫెయిలై 19 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికీ శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణానంతరం ప్రతి విద్యార్థికీ ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికెట్ కల్పించి, వివిధ సంస్థల్లో నూరుశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిపిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువకులు వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని, ఈనెల 8వ తేదీ నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు.


అసోసియేషన్‌పై అసత్య ప్రచారం తగదు



మాట్లాడుతున్న షేక్.సుభాని

నగరంపాలెం: నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌పై అసత్య ప్రచారం తగదని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సుభాని అన్నారు. అరండల్‌పేట ఒకటో వీధిలోని ఓ హోటల్‌లో అసోసియేషన్ రాష్ట్ర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్‌పై రాజకీయ ప్రచారం చేయవద్దని అన్నారు. ఇటీవల విజయవాడ వరదల వేళల్లోనూ వేలాది మోటారు సైకిళ్లకు మరమ్మతులు చేశామని తెలిపారు. అనవసరమైన కార్పొరేషన్ ఏర్పాటుతో మెకానిక్‌లకు ఎటువంటి ఉపయోగం ఉండదని అన్నారు. కొన్నిచోట్ల మెకానిక్‌లు గుర్తింపు కార్డులను పోలీసులకు చూయించిన ట్రాఫిక్ నిబంధనలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు ఉల్లి సాంబశివరావు మాట్లాడుతూ వాట్సాప్ గ్రూప్‌లు, యూట్యూబ్‌ల్లో తమ అసోసియేషన్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి నకిలీ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కోరారు. ఏపీలోని మెకానిక్‌ల సంక్షేమం, అభివృద్ధి కోసమే అసోసియేషన్ ఆవిర్భవించిందని చెప్పారు. సమావేశంలో నాయకులు నాగరాజు, శ్రీనివాసరావు, అన్వర్‌బాషా, భవాని, సయ్యద్ అబ్దుల్ హమీద్, గణేష్, సుభాని, 26 జిల్లాల కార్యవర్గం పాల్గొన్నారు.

దర్శక దిగ్గజం దాసరి నారాయణరావు



దాసరి నారాయణరావు చిత్రపటం వద్ద నివాళి

నగరంపాలెం: అగ్ర దర్శకుడు దాసరి నారాయణరావు జన్మదిన వేడుకలు తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ వసతి గృహంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘం కార్యదర్శి బాలిశెట్టి విజయ్‌కుమార్ మాట్లాడుతూ దాసరి నారాయణరావు 150 పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారని అన్నారు. 55 చిత్రాలను ఆయన నిర్మించారని పేర్కొన్నారు. తెలుగు తల్లి పార్టీని ప్రారంభించారని, వార్తా పత్రికను కూడా స్థాపించారని చెప్పారు. 18 వేలకు పైగా సంఘాలు తమ పేరుతో ఉండే దర్శకుడు మరొకరు లేరని తెలిపారు. 16 నంది అవార్డులు, ప్రతిష్టాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డును అందుకున్నారని పేర్కొన్నారు. ఏపీలో కాపు సంఘాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ఆయన కృషి మరువలేదని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షులు తుమ్మల కృష్ణకిషోర్, కోశాధికారి వూరుబండి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

మంగళగిరి టౌన్: వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లను కేటాయించాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.దయాకర్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని వృత్తిదారుల సంఘం కార్యాలయంలో ఆదివారం విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. కూటమి నాయకులు వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని విమర్శించారు. గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కు వడ్డెర వృత్తిదారులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెరలు ఆర్థికంగా ఎదగడానికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గుంటూరు జిల్లాలో వడ్డెరలు వివిధ ప్రమాదాలకు గురై మృతి చెందారని.. వారి కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పనిచేసే సమయంలో ఎవరైనా మృతిచెందితే వారికి నష్ట పరిహారం కింద రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం 8 మంది వడ్డెర వృత్తిదారులతో జిల్లా సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి.శంకర్, కార్యదర్శిగా శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా సుబ్బరాయుడు, మరో ముగ్గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వృత్తిదారుల సంఘం కన్వీనర్ ఈమని అప్పారావు తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేద విద్యార్థుల పరీక్షలు



పండిత ప్రకర్ష కార్యక్రమంలో వేద విద్యార్థులతో అధ్యాపకులు

కొల్లూరు: వేద విద్యార్థులకు 101వ వేద పరీక్షల నిర్వహణ కార్యక్రమం ఆదివారంతో ముగిసినట్లు నిర్వహణ కార్యదర్శి తాడేపల్లి వెంకట సింహాద్రి శాస్త్రి తెలిపారు. ఈ నెల 2 నుంచి కొల్లూరులోని పార్వతీ సంస్కృత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలు ముగిసాయన్నారు. వేద పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులతో పరీక్షల అనంతరం అధ్యాపకులు పండిత ప్రకర్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సోమవారం ధ్రువపత్రాల పంపిణీతోపాటు, వేద స్వస్తి, వేద పండితుల సన్మాన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రారంభమైన చిన్నారుల ఈత శిక్షణ శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గోకరాజు గంగరాజు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి, అమరావతి కరకట్ట వెంట ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిన్నారుల ఈత శిక్షణ శిబిరం ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 17 ఏళ్లుగా పిల్లలకు ఏటా ఈతలో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. సుమారు 200 మంది పిల్లలకు ఈతలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఈతతో పాటు బీచ్‌వాలీబాల్, షటిల్, బాడ్మింటన్, వాకింగ్, సైక్లింగ్ తదితర ఎక్సర్‌సైజ్‌ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆక్వా డెవిల్స్‌లో ఈత నేర్చుకున్న చిన్నారులు జాతీయ స్థాయి ఈత పోటీల్లో పాల్గొంటున్నారని గుర్తుచేశారు. అసోసియేషన్ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ మాట్లాడుతూ.. సుమారు 5 వేల మంది పిల్లలకు ఈత నేర్పించామని, పిల్లలకు రోజూ శిక్షణ అనంతరం బూస్ట్ పాలు, గుడ్లు, బిస్కెట్లు అందజేస్తామని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి వై.వి.రమేష్‌కుమార్, కోశాధికారి కె.వి.రామయ్య, కన్వీనర్ చెల్లారి జోజిబాబు, ఉపాధ్యక్షులు గోపాళం సాంబశివరావు, సహాయ కార్యదర్శులు అమ్మిరెడ్డి రామిరెడ్డి, గుండు జనార్ధనరావు, కె.ఎస్.రామచంద్రరావు, ఎమ్.నరసరాజు, వెంకటరెడ్డి, రాము, సాంబయ్య, కమిటీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.